

నిశ్శబ్దం

సూర్యకిరణం సూదిలా గుచ్చుకుని కొళాయి నీళ్ళు కార్చిన చప్పుడుకి కాకులు మేలుకున్నాయి.

కొక్కొరొక్కోలు గోలచేశాయి.

రాజులు, మూతి విరుపులు మెటిక విరుపులు, పెదవిమీది తిట్లు బిందె చప్పుడులో కలిసిపోయాయి.

బస్సు బొయ్యిమని నీళ్ళ బిందెలో అనారోగ్యాన్ని చల్లింది.

పాలలో నీళ్ళు చాపకింద నీటిలా చేరాయి.

పాలబిందెల సైకిళ్లు తలుపులు తట్టాయి.

కాఫీమీద ఆశతో కిరసనాయిల్ స్టౌలో జ్వాల ఆకలిలా రెపరెపలాడింది.

సాసరులో కప్పు గడగడ వణికింది.

పడక్కుర్చీ బరువుగా నిట్టూర్చింది.

దినపత్రిక గరగరలాడింది.

సమ్మెలు, సత్యాగ్రహాలు. ఐక్యతా సమావేశాలు, కమీషన్ రిపోర్టులు, ఆత్మహత్యలు, హాస్యప్రసంగాలు, దినఫలాలు వెలుగునీడలు మొయ్యలేక అక్షరాలు మూలిగాయి.

పెదడు సమ్మె అంది.

సమ్మె సమ్మె సమ్మె టు ది పవర్ ఆఫ్ యెన్ అన్నాయి నరాలు.

నలుగేళ్ల పసి యేడుపు పద్నాలుగేళ్ళ పైట పరపర నలభయ్యేళ్ళ మట్టెల రొద డెభ్భయ్యేళ్ళ నులకమంచం సొద ఖాళీడబ్బాల కోర్కెల వ్యథ విని, విని విని—

పేపరు గోడకెళ్ళి కొట్టుకుని కుప్ప కూలిపోయింది.

చిరిగిన చొక్కాజేబుని సూది చురుక్కుమనిపించింది.

ఒకే గిన్నెలో వున్న అన్నం బరువు మొయ్యలేక మూడు గిన్నెల టిఫిన్ కారియర్. గరిమనాభి తప్పి చప్పుడుతో సైకిల్ బెల్లుని పలకరించింది.

స్టౌరన్ మొరుగుతూ కాకీబట్టల్ని తరిమి కొట్టింది.

సూర్యకిరణాలుకాళ్ళకింద ముల్లుచల్లాయి.

సినిమా రికార్డు అరిగిపోయి 'సమ్మె' దగ్గర సమ్మె ప్రకటించింది.

ఫ్యాక్టరీ ఇనపగేటు దగ్గర నమస్కారాలు నిలవ నీటిలో కాయితం ముక్కల్లా పడ్డాయి. అలోవలోలు, అరె అరేలు, ఓహోహోలు. చ్చొచ్చొచ్చోలు వింటూ అందుకుంటూ సైకిలు ముందుకు నడిచింది.

కారెక్కిన కారుహారన్ సైకిల్ని కసిరి కొట్టింది, తిట్టింది.

ఎండుటాకులా వినయం కారుకి వందనం చేసింది. సైకిల్ లాక్ చేసినచప్పుడుకారురమ్మంటోందన్న వాక్యానికి ఫుల్‌స్టాప్ పెట్టింది.

స్వింగ్‌డోర్ చిరుచప్పుడు చేసింది.

జీతాలు పెంచాలన్న సమ్మె ఆపితే లక్ష్మీదేవి ఆనందంగా నీయింటో తాండవిస్తుంది అన్నట్టు పేపర్‌వెయిట్ టేబిల్‌మీద గ్లాసుపై ఫుల్లుమంది. కోపం కొర కొరమంది.

క్రోధం గుర్రుమంది.

స్వింగ్‌డోర్ రగులుతున్న కట్టెలచప్పుడు చేసింది. గడియారంఆరుగంటల్నిమూడొంతుల అరవై అయిదు రోజులంత తాపీగా కొట్టింది.

సైకిల్‌లాక్ తక్కుమన్న చప్పుడు ఎర్ర టోపీల బూటుకాళ్ళ టకటకల్ని, గంజిపెట్టిన కాకీబట్టల గరగరల్ని, సంకెళ్ళ గలగలల్ని ప్రసవించింది. నిస్సహాయత నిట్టూర్చింది.

కారు మెత్తగా నవ్వుకుంది.

చీకటి మత్తుగా ముసురుకుంది.

—యమ్వీయల్